ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక




## సీఏఏ అమలు నిలిపివేయడానికి సుప్రీం నిరాకరణ


2లో..

సంపుటి: 1 | సంచిక: 344 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 20 మార్చి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# జోరందుకున్న జంపింగ్స్



### ఆపరేషన్ ఆకర్ష్ మరింత పదునెక్కే ఛాన్స్




హైదరాబాద్, మార్చి 19 (ప్రభాత ఉదయం): గులాబీ పార్టీకి గడ్డుకాలం నడుస్తోంది. గతంలో కేసీఆర్ అనుసరించిన ఆపరేషన్ ఆకర్ష్ మంత్రం..ఇప్పుడు బీఆర్ఎస్‌కే రివర్స్ కొడుతోంది.ఒకే ఒక్క ఓటమి కారు పార్టీని కల్లాస్ చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌కు చెందిన కీలక నేతలు వరుసగా గుడ్‌బై చెప్పేస్తున్నారు. కాంగ్రెస్, కమలం తీర్థం పుచ్చుకుంటున్నారు. గేట్లు తెరిచానంటూ సీఎం రేవంత్ హెచ్చరిండంతో బీఆర్ఎస్ నుంచి ఆపరేషన్ ఆకర్ష్ మరింత పదునెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ నుంచి పడే నెక్స్ట్ వికెట్ ఎవరనే చర్చ జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల ముందు జంపింగ్ జపాంగ్‌లతో తెలంగాణ రాజకీయాలు మరోసారి హాట్‌హాట్‌గా మారాయి. గతంలో చేరికలతో ఫుల్ అయిన కారు పార్టీకి ఇప్పుడు షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. సిట్టింగ్ ఎంపీలు, తాజా, మాజీ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా గులాబీ పార్టీకి గుడ్ చెప్పి కాంగ్రెస్, బీజేపీలో చేరుతున్నారు. ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ కూడా ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టి కారు పార్టీ నేతలకు గాలం వేస్తున్నారు. ఎంపీ ఎన్నికల్లో సీటు హామి ఇస్తూ పార్టీలో చేర్చుకుంటున్నారు. రాష్ట్రంలో ఇటు కాంగ్రెస్ అధికారంలో ఉంది. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండేటంతో.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే ఫైట్ అంటూ.. కారు పార్టీని సైడ్ చేసే ఎత్తులతో ముందుకు వెళ్తున్నారు.ఫలితంగా మొన్నటి వరకు బలంగా కనిపించిన బీఆర్ఎస్ ఒకే ఒక్క ఓటమితో కీలక నేతలు చేజారుతూ బలహీనంగా మారుతోంది. అసెంబ్లీ ఎన్నికలు జరిగి నాలుగు నెలలు గడవకుండానే ఎమ్మెల్యేల జంపింగ్ జపాంగ్‌లు స్టార్ట్ అయ్యాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ పక్షాన గెలిచిన మాజీ మంత్రి దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. దానంతో పాటు మరికొంతమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్‌కు టచ్‌లోకి వెళ్లినట్టు జరుగుతున్న ప్రచారం గులాబీ పార్టీలో గుబులు పెట్టిస్తోంది. గేట్లు తెరిచానని, ఇకపై తన రాజకీయం చూస్తారంటూ సీఎం రేవంత్ హెచ్చరించడం కారు పార్టీని కకావికలం చేస్తోంది. రానున్న రోజుల్లో ఇంకెంత మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హస్తం గూటికి చేరుతారో అనే చర్చ జరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ చావు దెబ్బకొట్టాలనే

..మిగతా 2లో

### సుప్రీంకోర్టులో కవిత
# రిట్ పిటిషన్



న్యూఢిల్లీ, మార్చి 19 (ప్రభాత ఉదయం): ఈడీ రిమాండ్‌ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేస్తూ సుప్రీంకోర్టులో ఎమ్మెల్సీ కవిత రిట్ పిటిషన్ దాఖలు చేశారు. "కవిత అరెస్టు విషయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఉల్లంఘించారు. చట్ట పరమైన ప్రక్రియ అనుసరించకుండా అరెస్టు చేశారు. కవిత అరెస్టు చట్టబద్ధం కాదు, ఏకపక్షంగా రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారు. పీఎంఎల్‌ఏ సెక్షన్ 19 ప్రకారం మహిళల విషయంలో పాటించాల్సిన నిబంధనలు ఉల్లంఘించారు. ఈడీ రిమాండ్‌ను రద్దు చేయాలి. ఈడీ కస్టడీ నుంచి విడుదల చేయాలి' కవిత తరఫు న్యాయవాదులు కోరారు. కాగా, మూడో రోజు కవిత ఈడీ కస్టోడియల్ ఇంటరాగేషన్ ముగిసింది. ఇండో స్పిరిట్లో 33 శాతం వాటా ఎలా వచ్చిందని ఈడీ ప్రశ్నించింది. 100 కోట్ల ముడుపులను ఎలా చెల్లించారు?. మొబైల్ ఫోన్లను ఎందుకు ఫార్మాట్ చేయాల్సి వచ్చిందంటూ ఈడీ ప్రశ్నల వర్షం కురిపించింది. విచారణ అనంతరం కవితకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కవితతో కేటీఆర్, అడ్వకేట్ మోహిత్ రావ్ ములాఖత్ అయ్యారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగ్‌పాల్ తీస్ హజారీ కోర్టుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జస్టిస్ కావేరి భావేజా నియమితులయ్యారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ, ఇతర కేసులను విచారించనున్నారు. అలాగే ఢిల్లీ హైకోర్టు జ్యూడిషియల్ సర్వీసెస్ లోని మరో 26 మంది జడ్జీలు బదిలీ అయ్యారు. లిక్కర్ స్కాం కేసులో అరెస్టయిన

..మిగతా 2లో

### తెలంగాణ గవర్నర్‌గా నేడు
## సీపీ రాధాకృష్ణన్ ప్రమాణం

2



### ప్రధాని మోదీకి
# నారీ'శక్తి' అభివాదం
### విపక్షాలకు గట్టి కౌంటరిచ్చిన బీజేపీ..

చెన్నై, మార్చి 19 (ప్రభాత ఉదయం): దేశంలోని ప్రతి తల్లి, ప్రతి కుమార్తె 'శక్తి'కి స్వరూపమేనంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఎన్నికల ప్రచారాల్లో పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 'శక్తి'ని నాశనం చేసేందుకే తమ పోరాటామంటూ ఇండియా కూటమి సంచలన వ్యాఖ్యలు చేస్తుండగా.. నారీశక్తిని బలోపేతం చేసేందుకు తమ పార్టీ ముందు ఉంటుందని.. తాను ప్రతీ తల్లి, ప్రతీ కుమార్తెను కాపాడుకునేందుకు ప్రాణ త్యాగానికైనా సిద్ధమేనని ప్రధాని మోదీ అన్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్‌కు కౌంటర్ ఇస్తూ.. నారీశక్తిపై ఉన్న గౌరవాన్ని మరోసారి రుజువు చేసుకుంది బీజేపీ. టార్గెట్ 400 అంటూ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రస్తుతం ప్రధాని మోదీ తమిళనాడులో పర్యటిస్తున్నారు. ఇటీవల సేలం జిల్లాలో జరిగిన ఓ ర్యాలీలో.. 11 మంది మహిళలు అపరశక్తులుగా మారి.. ప్రధాని మోదీకి సాదర స్వాగతాన్ని పలికారు. ఒకవైపు దేశంలో మహిళలపై దాడులు జరుగుతుండగా.. మరోవైపు నారీశక్తిపై తమకున్న గౌరవాన్ని వినూత్న రీతిలో ఈ విధంగా చూపిస్తోంది బీజేపీ. లోక్‌సభ షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల ప్రచారంలో మునిగిపోయారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ప్రతి రోజూ ఏదో ఒక రాష్ట్రంలో పర్యటిస్తూ.. రోడ్‌షోలు, ర్యాలీలు, బహిరంగ సమావేశాల్లో పాల్గొంటూ ప్రసంగిస్తున్నారు. ఈ క్రమంలో

..మిగతా 2లో

# పార్టీ మారడం లేదు

### క్లారిటీ ఇస్తున్న బీఆర్ఎస్ నేతలు



హైదరాబాద్, మార్చి 19 (ప్రభాత ఉదయం): భారత రాష్ట్ర సమితి నేతలకు పెద్ద కష్టం వచ్చింది. వారిపై రోజూ .. పార్టీ మారుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో సీనియర్ నేతలు మీడియా ముందుకు వచ్చి తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని పార్టీ మారే ఉద్దేశం లేదని అంటున్నారు. అయితే రోజుకో సీనియర్ నేత పార్టీకి గుడ్ బై చెబుతూండటంతో వారి మాటలను అనుమానాస్పదంగానే

..మిగతా 2లో

### 25 గ్యారంటీల మేనిఫెస్టోకు
## కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆమోదం



న్యూఢిల్లీ, మార్చి 19 (ప్రభాత ఉదయం): రానున్న లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. మూడున్నర గంటలకుపైగా ఈ సమావేశంలో మేనిఫెస్టోపై చర్చించారు. మొత్తం 25 గ్యారంటీల అమలుకు సీడబ్ల్యూసీ ఆమోదం తెలిపింది. 'పాంచ్ న్యాయ్' పేరుతో అయిదు అంశాలతో మొత్తం 25 గ్యారంటీల మేనిఫెస్టోను ఖరారు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు కీలక నేతలు హాజరయ్యారు. తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు సైతం సాయంత్రం పాల్గొన్నారు. ఇప్పటికే రైతులు, మహిళలు, యువత, బలహీన వర్గాలే లక్ష్యంగా 'హిస్సేదారి న్యాయ్',

..మిగతా 2లో



### బాబా రాందేవ్‌పై సుప్రీం ఆగ్రహం

2



### మహారాష్ట్రలో ఎన్‌కౌంటర్

2

# జోరందుకున్న జంపింగ్స్

మొదటి పేజీ తరువాయి...

వ్యూహంతో.. కాంగ్రెస్ ముందుకు వెళ్తున్నట్టు తెలుస్తోంది. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వక భేటీ పేరిట కలిసినప్పటికీ ఇప్పటివరకు ఎవరూ పార్టీ మారలేదు. కానీ గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రాతినిధ్యం లేని కాంగ్రెస్ పార్టీలోకి, నగరానికి చెందిన ఓ ఎమ్మెల్యే రావడంతో రాజకీయం రసకందాయంలో పడిందని అంటున్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఏ క్షణమైనా, ఏమైనా జరగవచ్చనే ఆలోచనతోనే ఎమ్మెల్యేలను అధికారికంగా పార్టీలో చేర్చుకోవడాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిందని, ఆపరేషన్ ఆకర్ష్‌కు ఇక మరింత పదును పెట్టే క్రమంలో గేమ్ స్టార్ట్ చేసిందని చెబుతున్నారు. ఇటీవల ఎన్నికల్లో బీఆర్ఎస్ పక్షాన మొత్తం 39 మంది ఎమ్మెల్యేలు గెలుపొందగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో ఆ సంఖ్య 38 అయ్యింది. అయితే వీరిలో మూడింట రెండొంతుల మంది అంటే 26 మంది కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నారనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే మెదక్ జిల్లాకు చెందిన నలుగురు, రంగారెడ్డి నుంచి ఇద్దరు, మేడ్చల్ నుంచి ఇద్దరు, కొత్తగూడెం జిల్లా నుంచి ఒక ఎమ్మెల్యే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. వీరంతా కాంగ్రెస్‌లో చేరతారా లేక మర్యాదపూర్వకంగానే కలిశారా అన్నది ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. అదే సమయంలో ప్రభుత్వం పడిపోయే పరిస్థితి వస్తే తాము అండగా నిలుస్తామని తనను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హామీ ఇస్తున్నారని రేవంత్‌రెడ్డి స్వయంగా చెప్పడం ఆసక్తి రేకెత్తిస్తోంది. మరోవైపు ఈ రోజే గేట్లు తెరిచానని, అవతలివైపు





ఎంతమంది ఉంటారో తనకు తెలియదంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యలు కూడా ఎప్పుడు ఏం జరుగుతుందోననే ఉత్కంఠకు తావిస్తున్నాయి. ఓటుకు కోట్లు వ్యవహారం తర్వాత అప్పటి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అప్రమత్తమై భవిష్యత్తులో ప్రభుత్వానికి ప్రమాదం లేకుండా ఉండేందుకు అనే కారణం చూపుతూ ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నారు. అయితే అప్పటి నుంచీ ఈ వ్యవహారాన్ని ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తప్పుపడుతూనే ఉంది. ఒక పార్టీలో గెలిచిన వారిని మరో పార్టీలో ఎలా చేర్చుకుంటారంటూ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా గతంలో పలుమార్లు నిలదీశారు. ఐతే త్వరలోనే కాంగ్రెస్ సర్కార్ కూలిపోతుందంటూ ఇటీవల బీఆర్ఎస్, బీజేపీ నేతలు కామెంట్స్ చేయడంతో కాంగ్రెస్ అప్రమత్తమైంది. వారి వ్యాఖ్యలను హైలెట్ చేస్తూ తమ ప్రభుత్వాన్ని కూలగొట్టేందుకు కుట్ర చేస్తున్నారని, అందుకే చేరికలు తప్పడం లేదని కౌంటర్ ఇస్తున్నారు రేవంత్. బీఆర్ఎస్‌కు చెందిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డిలు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అంతకు ముందు వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, పెద్దపల్లి ఎంపీ నేతకాని వెంకటేశ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో, రంజిత్‌రెడ్డితో కలిసి మొత్తం ముగ్గురు బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నట్టయింది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు దక్కించుకోవాలనే లక్ష్యంతోనే రేవంత్ రెడ్డి చేరికలను ప్రోత్సహిస్తున్నట్టు తెలుస్తోంది. ముందు గ్రేటర్ హైదరాబాద్‌పై దృష్టి పెట్టారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జీహెచ్ఎంసీలో కాంగ్రెస్‌కు ఒక్క సీటు రాలేదు. దీంతో హైదరాబాద్‌లో కాంగ్రెస్ బలాన్ని పెంచుకునేందుకు.. ఇక్కడ లీడర్లకు గాలం వేస్తోంది. ఇప్పటికే ప్రస్తుత జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, వికారాబాద్ జిల్లా ఛైర్ పర్మన్ పట్నం సునీతారెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పుడు దానం, రజింత్ రెడ్డి కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో.. భవిష్యత్తులో ఇంకేం జరగబోతోంది అనే ఆసక్తి నెలకొంది. పార్టీ నేతలను కాపాడుకునేందుకు.. ఓ వైపు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విశ్వప్రయత్నాలు చేస్తున్నా.. నేతల గోడ దూకుళ్లు మాత్రం ఆగడం లేదు. ఓ వైపు జంపింగ్‌లు, మరోవైపు కవిత అరెస్టుతో బీఆర్ఎస్ నేతలు, కేడర్‌లో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.




## సీఏఏ అమలు నిలిపివేయడానికి సుప్రీం నిరాకరణ

### కేంద్రానికి 3 వారాల గడువు

న్యూఢిల్లీ, మార్చి 19 (ప్రభాత ఉదయం): దేశంలో లోక్‌సభ ఎన్నికలకు ముందు పౌరసత్వ సవరణ చట్టం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2019 లోనే చట్టం ఆమోదం పొందినా.. తాజాగా ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం దాన్ని అమల్లోకి తీసుకురావడం తీవ్ర దుమారానికి కారణం అయింది. ఈ నేపథ్యంలోనే సీఏఏను తీవ్రంగా వ్యతిరేకిస్తూ చాలా మంది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలోనే వాటన్నింటిపైనా విచారణ జరిపిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటిషన్లకు సమాధానం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. అందుకు 3 వారాల గడువు ఇవ్వనున్నట్లు తెలిపింది. ఇదే సమయంలో సీఏఏ అమలుపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. పౌరసత్వ సవరణ చట్టం అమలుపై స్టే విధించాలని కోరుతూ దాఖలైన 237 పిటిషన్లపై మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం.. ప్రస్తుతం పౌరసత్వ సవరణ చట్టం అమలుపై స్టే విధించడానికి నిరాకరించింది. మరోవైపు.. ఈ 237 పిటిషన్లకు వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశాలు జారీ చేసింది. ఇందు కోసం 3 వారాల గడవును ఇచ్చింది. అనంతరం ఈ కేసు విచారణను ఏప్రిల్ 9 వ తేదీన చేపడతామని సుప్రీం కోర్టు తెలిపింది. సీఏఏ అమలును సవాల్ చేస్తూ కేరళకు చెందిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్-ఐయూఎంఎల్, డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా-డీవైఎఫ్ఐ, తృణముల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రా, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్, మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ సహా మొత్తం 237 పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలు అయ్యాయి. ఈ క్రమంలోనే ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్-ఐయూఎంఎల్ తరఫున సీనియర్ లాయర్ కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తున్నారు. 1995 నాటి పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 2 ను సవరించారని.. దాని ప్రకారమే ఆఫ్ఘన్, బంగ్లా, పాక్‌లో ఉన్న హిందూ, సిక్కు, బౌద్ధ, జైన్, పార్సి, క్రైస్తవులకు పౌరసత్వాన్ని ఇవ్వనున్నారని తెలిపారు. ఆ 3 దేశాల్లో మతపరమైన హింసకు గురవుతున్న వారిని రక్షించాలన్న ఉద్దేశంతో ఈ పౌరసత్వ సవరణ చట్టాన్ని రూపొందించారు

## తెలంగాణ గవర్నర్‌గా నేడు సీపీ రాధాకృష్ణన్ ప్రమాణం



హైదరాబాద్, మార్చి 19 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ నియామకమైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం జార్ఖండ్ గవర్నర్‌గా ఉన్న రాధాకృష్ణన్.. తెలంగాణతో పాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రికి రాధాకృష్ణన్ హైదరాబాద్‌కు చేరుకున్నారు. తెలంగాణ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ నేడు ఉదయం 11:15 గంటలకు రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాధాకృష్ణన్‌తో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. కాగా తమిళిసై గవర్నర్ పదవికి రాజీనామా చేయడంతో ఆ బాధ్యతలను రాధాకృష్ణన్‌కు అప్పగించినట్లు రాష్ట్రపతి భవన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. తెలంగాణ గవర్నర్ తమిళిసై రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. పూర్తి స్థాయి గవర్నర్లను నియమించే వరకు తెలంగాణ, పుదుచ్చేరి బాధ్యతలను నిర్వర్తించాలని రాధాకృష్ణన్‌ను కోరుతూ రాష్ట్రపతి భవన్ ఓ లేఖ విడుదల చేసింది.

## సుప్రీంకోర్టులో కవిత రిట్ పిటిషన్

మొదటి పేజీ తరువాయి...

కవితకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు స్పెషల్ జడ్జి నాగ్ పాల్ ఏడు రోజుల కస్టడీ విధించిన సంగతి తెలిసిందే.మార్చి 15న అరెస్టయిన కవిత ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్నారు. మార్చి 23 వరకు కవిత కస్టడీలోనే ఉండనున్నారు. లిక్కర్ స్కాం కేసులోఆప్ నేతలకు కవిత రూ. 100 కోట్లు చెల్లించారని ఈడీ ప్రకటించిన సంగతి తెలిసిందే.. కవిత అరెస్టయినప్పటి నుంచి కవిత కుటుంబ సభ్యులు ఢిల్లీలోనే ఉంటున్నారు. కేటీఆర్, హరీశ్ రావు ప్రతి రోజు సాయంత్రం కవితను కలుస్తున్నారు. మార్చి19న సాయంత్రం కూడా కవితను ఈడీ ఆఫీసులో కలిసి మాట్లాడి వెళ్లిపోయారు కేటీఆర్.



## మహారాష్ట్రలో ఎన్‌కౌంటర్

గడ్చిరోలి, మార్చి 19 (ప్రభాత ఉదయం): మహారాష్ట్రలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు హతమయ్యారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని గడ్చిరోలిలో భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్ట్ అగ్రనేతలు హతమైనట్టు అధికారులు తెలిపారు. వీరిలో ఒకరిపై రూ.36 లక్షల రివార్డు ఉందని చెప్పారు. తెలంగాణ సరిహద్దుల నుంచి ప్రాణహిత నదిని దాటి కొంతమంది నక్సల్స్ ప్రవేశించినట్టు సోమవారం మధ్యాహ్నం పోలీసులకు నిఘా వర్గాల ద్వారా సమాచారం అందింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పలుచోట్ల దాడులకు వ్యూహరచన కోసం తెలంగాణ నుంచి గడ్చిరోలిలోకి ప్రవేశించినట్టు జిల్లా ఎస్పీ నీలోత్పల్ చెప్పారు. నిఘా వర్గాల సమాచారం ఆధారంగా గడ్చిరోలి పోలీస్ సీ-60, సీఆర్పీఎఫ్ సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. రేపన్‌పల్లి సమీపంలోని కోలమర్క పర్వతాలలో మంగళవారం ఉదయం సి-60 యూనిట్‌లో ఒకరు కూబింగ్ నిర్వహిస్తుండగా, నక్సలైట్లు వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ప్రతీకారం తీర్చుకున్నారని ఆయన తెలిపారు. 'కాల్పులు ఆగిపోయిన తర్వాత ఆ ప్రాంతంలో శోధించగా నలుగురు నక్సలైట్ల మృతదేహాలు లభ్యమయ్యాయి.. వారిలో ఒకరి తలపై రూ. 36 లక్షల నగదు రివార్డు ' ఉందని ఆయన చెప్పారు. ఘటనాస్థలిలో ఒక ఏకే-47 రైఫిల్, ఒక కార్బైన్, రెండు కంట్రీ మేడ్ పిస్టల్స్, నక్సల్ సాహిత్యం, ఇతర వస్తువులు కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. హతమైన నక్సల్స్‌ను ఇద్దరు దళ కార్యదర్శులు వర్గీశ్, మగ్తూ.. సభ్యులు కుర్సుంగ్ రాజు, కుడిమెట్ట వెంకటేశ్‌గా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు.

## ప్రణీత్‌రావు విచారణలో వెలుగులోకి సంచలనాలు

హైదరాబాద్, మార్చి 19 (ప్రభాత ఉదయం): మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు వ్యవహారంలో విచారణ కొనసాగుతోంది. ఎస్ఐబీలోని టాపింగ్ డివైజ్ మొత్తాన్ని ప్రణీత్‌రావు ధ్వంసం చేసినట్లు గుర్తించారు. మరోసారి పనికిరాకుండా.. డివైజ్‌ను ధ్వంసం చేసి అందులో హార్డ్ డిస్క్ మొత్తాన్ని పగలగొట్టినట్లు తేలింది. అడవుల్లో పడేసిన డివైజ్‌లను స్వాధీన పరుచుకునేందుకు పోలీసుల ప్రయత్నిస్తున్నారు. మరో వైపు ప్రణీత్‌రావు వెనకాల మీడియా సంస్థ యజమాని ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఒక మీడియా సంస్థ యజమాని ఇచ్చిన నెంబర్లను ట్యాప్ చేసిన ప్రణీత్ రావు.. ఆ మీడియా సంస్థ యజమాని దగ్గర ఏకంగా ఒక సర్వర్ పెట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు. మరొక రెండు సర్వర్ లను రెండు చోట్ల పెట్టినట్లు గుర్తించారు. వరంగల్‌తో పాటు సిరిసిల్లలో సర్వర్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడైంది. బీఆర్ఎస్ కీలక నేత ఆదేశాలతో ప్రణీత్ రావు సర్వర్లు ఏర్పాటు చేసినట్లు గుర్తించారు.

## ప్రధాని మోదీకి నారీ'శక్తి' అభివాదం

మొదటి పేజీ తరువాయి...

మంగళవారం తమిళనాడులో మోదీ పర్యటించారు. సేలం జిల్లాలో నిర్వహించిన బీజేపీ బహిరంగ సమావేశంలో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ భావోద్వేగానికి లోనయ్యారు. సేలంలో పదేళ్ల క్రితం (2013) హత్యకు గురైన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ రమేష్‌ను గుర్తు చేసుకుంటూ ఉద్వేగానికి గురయ్యారు. పార్టీ కోసం రమేష్ పగలు, రాత్రి కష్టపడి పనిచేశారని గుర్తు చేసుకున్నారు. దీంతో కొద్దిసేపు తన ప్రసంగాన్ని నిలిపివేశారు. తరువాత తిరిగి ప్రారంభించారు. "నేను ఈ రోజు సేలంలో ఉన్నాను. ఆడిటర్ రమేష్‌ను ఎప్పటికీ మర్చిపోలేను. ప్రస్తుతం ఆయన మనతో లేరు. ఆయనో గొప్ప వక్త. పార్టీ కోసం ఎంతో కష్టపడి పనిచేశారు. కానీ, ఆయన హత్యకు గురయ్యారు. ఈ వేదిక సాక్షిగా నేను ఆయనకు నివాళి అర్పిస్తున్నా" అని ప్రధాని మోదీ అన్నారు. కాగా వృత్తిరీత్యా ఆడిటర్ అయిన రమేష్ గతంలో తమిళనాడు రాష్ట్ర భాజపా ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 2013లోసేలం పట్టణంలోని మరవనేరి ప్రాంతంలోని తన ఇంటి సమీపంలో గుర్తు తెలియని ముఠా హత్య చేసింది. తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కెఎన్ లక్ష్మణన్‌ను కూడా ప్రధాని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో పార్టీ విస్తరణలో ఆయన గొప్ప కృషి చేశారని, ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో ఆయన పాత్ర మరువలేనిదని అన్నారు. రాష్ట్రంలో అనేక పాఠశాలలను కూడా ప్రారంభించినట్లు తెలిపారు. తమిళనాడు అభివృద్ధికి తమ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని మోదీ పేర్కొన్నారు.

## పార్టీ మారడం లేదు

మొదటి పేజీ తరువాయి...

చూస్తున్నారు. తాజాగా మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, శ్రీనివాస్ గౌడ్ తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను బీజేపీలోకి చేరుతున్నట్లు వస్తున్న వార్తలపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. తాను బీజేపీలో చేరుతున్నాననడం అవాస్తవమని స్పష్టం చేశారు. అయోధ్య గుడికి వెళ్తే బీజేపీలో చేరినట్టా అని ప్రశ్నించారు. తానేంటో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు తెలుసని అన్నారు. కొందరు కోడిగుడ్డు మీద ఈకలు పీకుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ప్రచారం చేస్తే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. హైదరాబాద్లోని తెలంగాణ భవన్లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రలోభాలు పెట్టినప్పటికీ ఆర్ఎస్ ప్రవీణ్కుమార్ లొంగలేదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ బహుజనుల కోసం పోరాడుతుందనే ఆర్ఎస్ ప్రవీణ్కుమార్ బీఆర్ఎస్లో చేరారని పేర్కొన్నారు. ఈ మేరకు పార్టీలోకి ఆర్ఎస్ ప్రవీణ్కుమార్కు స్వాగతం పలికారు. బీఆర్ఎస్ పార్టీలా దేశంలో బహుజనుల కోసం పోరాడిన పార్టీ ఉన్నదా అని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ను వీడే ప్రసక్తే లేదు..పార్టీని కాపాడుకునేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన తేల్చిచెప్పారు. వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యతో కలిసి ఎర్రబెల్లి దయాకర్ రావు మీడియాతో మాట్లాడారు. ఇతర పార్టీల్లోకి వెళ్లే ముచ్చటనే లేదని స్పష్టంగా చెబుతున్నాను. బీఆర్ఎస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు కష్టపడి పని చేస్తాను. ప్రతిపక్షంలో కూడా పని చేసిన సందర్భాలు ఉన్నాయి. చాలా మంది సీఎంలను కూడా ఎదుర్కొన్నాను. పార్టీలోకి రాకపోతే వర్ధన్నపేటను ఎస్సీ రిజర్వ్ చేస్తాను.. ఎక్కడ పోటీ చేయనివ్వకుండా చేస్తానని రాజశేఖర్ రెడ్డి బెదిరించారు. ఎంపీగా ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీలోకి లాగేందుకు ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా పార్టీలో చేర్చుకోవాలని ప్రయత్నం చేశారు. కానీ తనను పాలకుర్తి ప్రజలు ఆశీర్వదించి గెలిపించారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని ఇబ్బందులు పెట్టినా బీఆర్ఎస్ను వీడే ప్రసక్తే లేదన్నారు. ప్రధాని దేశ నాయకుడిగా కాకుండా గల్లీ నేతగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపించింది. రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చడం మోదీకి అలవాటు అని విమర్శించారు. వందల ప్రాణాలను బలి తీసుకున్న మోదీకి కవితను జైలుకు పంపించడం చిన్న విషయమని అన్నారు. వ్యతిరేకించిన వారిని ఇబ్బంది పెట్టడమే మోదీ నైజమని ఆరోపించారు. బీజేపీలో చేరిన వారు పవిత్రులైపోతున్నారని అన్నారు. ప్రాంతీయ పార్టీలను కబళించే కుట్ర జరుగుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ వచ్చే ముందు ఈడీ, సీబీఐ వస్తాయని విమర్శించారు. మోదీ పాలన దేశం భ్రష్టు పట్టిందని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

## 25 గ్యారంటీల మేనిఫెస్టోకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆమోదం

మొదటి పేజీ తరువాయి...

'కిసాన్ న్యాయ్', 'నారీ న్యాయ్', 'శ్రామిక్ న్యాయ్','యువ న్యాయ్' పేరిట హామీలను ప్రకటించిన విషయం తెలిసిందే. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం, రైతులకు వడ్డీలేని రుణాలు, ప్రస్తుతం కేంద్రం అందిస్తున్న సాయం పెంపు, యువత కోసం 30 లక్షల ఉద్యోగాల భర్తీ, ప్రభుత్వ లేక ప్రైవేట్ రంగంలో 25 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న ప్రతి డిప్లొమా లేక డిగ్రీ హెూల్డర్‌కు అప్రెంటిస్ షిప్ శిక్షణకు రూ.లక్ష సాయం, 30 ఏళ్లలోపు యువత స్టార్టప్‌లకు నిధులు సమకూర్చడానికి రూ.5,000 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు, పేపర్ లీకేజీల నివారణకు ప్రత్యేక చట్టం, మహిళల కోసం నిరుపేద కుటుంబంలోని ఒక మహిళకు ఏడాదికి రూ.లక్ష సాయం వంటి 25 హామీలపై చర్చించి తుది నిర్ణయం తీసుకున్నారు.

## హైదరాబాద్‌లో పలుచోట్ల వర్షం



హైదరాబాద్, మార్చి 19 (ప్రభాత ఉదయం): తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మంగళవారం తెల్లవారుజాము నుంచే నగరంలో పలుచోట్ల వర్షం కురుస్తోంది. ఇక, మరో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. హైదరాబాద్ ఉదయం దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, సరూర్‌నగర్, కర్మాన్‌ఘాట్, వనస్థలిపురం, ఎల్బీనగర్, హయత్ నగర్, చార్మినార్, కోఠి పలు చోట్ల వర్షం కురుస్తోంది. ఇక, కామారెడ్డి, సంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో కూడా భారీ వర్షం కురుస్తోంది. వర్షాల నేపథ్యంలో మెదక్ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. కౌడిపల్లి మండలం జాబితాండలో అకాల వర్షం, ఈదురు గాలుల కారణంగా ఇంటి పైకప్పు కూలిపోయింది. ఈ ప్రమాదంలో మూడేళ్ల చిన్నారి సంగీత చనిపోయింది. ఇక, ఈదురు గాలల వర్షం కారణంగా పలుచోట్ల రైతులకు తీవ్ర నష్ట వాటిల్లింది. గాలుల కారణంగా మామిడి పూత, కాయలు రాలిపోయాయి. అలాగే, వరి పంట, మొక్కజొన్న పంటలకు నష్టం జరిగింది.

## బాబా రాందేవ్‌పై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ, మార్చి 19 (ప్రభాత ఉదయం): ప్రముఖ యోగా గురు బాబా రాందేవ్‌కి చెందిన పతంజలి సంస్థ వ్యాపార ప్రకటనలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ప్రకటనలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొంటూ బాబా రాందేవ్‌కు షోకాజ్ నోటీసులు జారీచేసింది. న్యాయస్థానం ముందు విచారణకు హాజరుకావాలని ఆయనను ఆదేశించింది. పతంజలి ఆయుర్వేదం, ఆ సంస్థ ఎండీ ఆచార్య బాలకృష్ణన్ ధిక్కార చర్యలపై అఫిడవిట్ దాఖలు చేయనందుకు పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పేర్కొంది. యోగా గురువు రాందేవ్, బాలకృష్ణన్‌లు తమ ముందు హాజరుకావాలని, కంపెనీ ఉత్పత్తుల ప్రకటనలు, వాటి ఔషధ ప్రభావానికి సంబంధించిన ధిక్కార చర్యలపై స్పందించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వ్యాక్సినేషన్ డ్రైవ్, ఆధునిక ఔషధాలకు వ్యతిరేకంగా రామ్‌దేవ్ దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. ఈ సందర్భంగా పతంజలి వ్యవస్థాపకుడిపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. నవంబర్ 2023లో పతంజలి ఆయుర్వేద్ తన ప్రకటనలలో 'తప్పుడు' వాదనలు చేయడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. అటువంటి పద్ధతులను ఆశ్రయించినందుకు ఆ సంస్థకు జరిమానా విధిస్తామని హెచ్చరించింది. 'పతంజలి ఆయుర్వేదం అన్ని తప్పుడు, తప్పుదోవ పట్టించే ప్రకటనలు తక్షణమే నిలిపివేయాలి.. ఈ కోర్టు అటువంటి ఉల్లంఘనలను చాలా తీవ్రంగా పరిగణిస్తుంది.. ఒక నిర్దిష్టమైన వ్యాధిని నయం చేయగలదని తప్పుడు ప్రకటన చేసిన ప్రతి ఉత్పత్తిపై రూ. 1 కోటి వరకు జరిమానా విధించడాన్ని పరిశీలిస్తాం' అని ధర్మాసనం తేల్చిచెప్పింది. కాగా, కరోనా వైరస్ కట్టడిలో ఆధునిక వైద్యం విఫలమైందని, అదో పనికిమాలిందంటూ బాబా రాందేవ్ చేసిన వ్యాఖ్యలపై అప్పట్లో తీవ్ర దుమారం రేగింది. ఐఎంఏ సైతం ఆయనపై రూ.1,000 కోట్లకు పరువు నష్టం దావా వేసింది. విమర్శలు రావడంతో ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, వివరణ ఇచ్చారు.. తాను ఉద్దేశపూర్వకంగా అలా అనలేదు, వాట్సాప్‌లో వచ్చిన మెసేజ్‌ను చదివి వినిపించానని తప్పించుకునే ప్రయత్నం చేశారు.

## రిజర్వాయర్లలో సరిపడా నీరు ఉంది

### తాగునీటి అవసరాలకు ఏవిధమైన ఇబ్బందులు లేవు



హైదరాబాద్, మార్చి 19 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలోని రిజర్వాయర్లలో సరిపడా నీరు ఉన్నందున ప్రస్తుత వేసవికాలంలో తాగునీటి అవసరాలకు ఏవిధమైన ఇబ్బందులు లేవని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్పష్టం చేశారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితులపై సంబంధిత శాఖల అధికారులతో నేడు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, యుద్ధప్రాతిపదికన మరమత్తులు చేపట్టి తాగునీటి సరఫరాను నిర్విరామంగా కొనసాగించాలని ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ లోనూ సరిపడా నీటిని అందిస్తున్నామని, ఎవరైనా అదనపు వాటర్ ట్యాంకులు కోరితే వాటిని కూడా అందిస్తున్నామని స్పష్టం చేశారు. మంచినీటి సరఫరా విషయంలో ఏవిధమైన ఆందోళనలు అవసరం లేదని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లలో నీటి లభ్యత, వేసవి కాలంలో తాగునీటి సరఫరాకు తీసుకున్నచర్యలపై సంబంధిత శాఖల కార్యదర్శులతో సమీక్షించారు. ఇటీవల ముగిసిన ఇంటర్ పరీక్షల స్ఫూర్తితో ప్రస్తుతం జరుగుతున్న పదవ తరగతి పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని సి.ఎస్. తెలిపారు. పదవ తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ఎస్.ఎస్.సి పరీక్షలు మొదలై రెండు రోజులు అయ్యాయని, మిగిలిన పరీక్షలను కూడా ఏ విధమైన ఇబ్బందులు కలుగ కుండా నిర్వహించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు ఎట్టి పరిస్థితుల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు ప్రతీ కేంద్రం వద్ద కనీసం ఒక కానిస్టేబుల్ లేదా హెూమ్-గార్డును నియమించినట్టు తెలిపారు.

# ఉద్యాన రంగంలో మేధో సంపత్తి హక్కులతో ఉపాధి అవకాశాలతో పాటు అధిక ఆదాయం సాధ్యం

## ప్రముఖ పేటెంట్ నిపుణులు శుభాజిత్ సాహా


సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు, పరిశోధన విద్యార్థులు

బుద్వేల్, మార్చి19(ప్రభాత ఉదయం): తెలంగాణ ఉద్యమ రంగంలో మేథో సంపత్తి హక్కుల ఆవిష్కరణలతో అధిక ఆదాయాలు లభించనున్నా యని, తెలంగాణ రాష్ట్రంలో అద్భుత ఆవిష్కరణలు జరుగుతున్నాయని, వాటన్నింటినీ మేథో సంపత్తి హక్కులుగా మార్చేందుకు సిద్ధం కావాలని ప్రముఖ పేటెంట్ నిపుణులు రిజల్యూట్ గ్రూప్ ఫర్ ఐపి సంస్థ లీగల్, ఐపిఆర్ హెడ్ సుభాజిత్ సాహా పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ లోని ఉద్యాన కళాశాలలో మంగళవారం ఉద్యాన రంగంలో వాణిజ్య సంబంధిత మేధో సంపత్తి హక్కుల పై శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఐ పి ఆర్ సెల్, తెలంగాణ రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ సంయుక్తంగా నిర్వహించిన మేదో సంపత్తి హక్కుల పై అవగాహన కార్యక్రమం సెమినార్ లో ఆయన కీలక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ... తెలంగాణ రాష్ట్రం మేధో సంపత్తి హక్కులకు నిలయంగా ఎదిగే అవకాశం ఉందని ఆ దిశగా అందరు కృషి చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో భౌగోళిక గుర్తింపులకు అనువైన అంశాలు, భౌగోళిక గుర్తింపు పొందే విధానం ఇప్పటివరకు ఉన్న భౌగోళిక గుర్తింపు పొందిన ఉత్పత్తుల వివరాలు, అప్లై చేసుకోవాల్సిన విధానం పైన ఉపన్యాసం చేశారు. ప్రత్యేకించి ఉద్యాన రంగంలో భౌగోళిక గుర్తింపు పొందిన ఉత్పత్తులు, పంటలలో రైతులు 20 నుంచి 30 శాతం అధిక లాభాలు, మార్కెట్ ధరలు పొందుతున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో మరో ఎనిమిది నుంచి పది ఉద్యాన పంటలు భౌగోళిక గుర్తింపుకు అనువుగా ఉన్నాయని అన్నారు. విశ్వవిద్యాలయాలు, రైతులు, ప్రభుత్వం కలిసికట్టుగా ముందుకు వస్తే రాష్ట్రం నుంచి అనేక ఉత్పత్తులను భౌగోళిక గుర్తింపులోకి తేవచ్చు అని పేర్కొన్నారు. భౌగోళిక గుర్తింపు పొందిన ఉత్పత్తులు ఉన్న ప్రదేశాల్లో టూరిజంకు అనేక అవకాశాలు ఉన్నాయని సుభాజిత్ సాహా పేర్కొన్నారు. ఒక ప్రత్యేకమైన భౌగోళిక ప్రాంతంనుంచి వచ్చే ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఇండికేషన్) వర్తిస్తుంది అని తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్ లక్క గాజులు, పోచంపల్లి ఇక్కత్, బనగానపల్లి మామిడి కాయలు, హైదరాబాద్ హలీం అంటే ప్రత్యేకమైనవి భౌగోళిక గుర్తింపుని సాధించాయని వివరించారు. ఏదైనా ఒక వస్తువు కు భౌగోళిక గుర్తింపు ఉండడం వలన ఆ ప్రాంతం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో 16 రకాల వస్తువులకు భౌగోళిక గుర్తింపు వచ్చిందని త్వరలో మరొక దానికి కూడా గుర్తింపు వచ్చే అవకాశం ఉందని వివరించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఉద్యాన వర్సిటీ హార్టికల్చర్ డీన్ డాక్టర్ ఎం. రాజశేఖర్ మాట్లాడుతూ.... పరిశోధనలో సృజనాత్మకత అంశాలు, రైతులకు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాన్ని వెతికే దిశగా పరిశోధన చేపట్టాలని విద్యార్థులు, పరిశోధకులు, ప్రొఫెసర్లను ఆయన కోరారు. విద్యార్థులు, పరిశోధకులు తాము శోధిస్తున్న అంశాలను మీదో సంపత్తి హక్కులుగా మార్చేందుకు అనువైన వాతావరణాన్ని విశ్వవిద్యాలయంలో కల్పిస్తున్నామని, భౌగోళిక గుర్తింపులు, పేటెంట్లకు అవకాశం ఉన్న ఉద్యాన రకాలు, ఉద్యాన అంశాలపై భవిష్యత్తులో వర్సిటీ దృష్టి సారిస్తుందని డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. పరిశోధన పత్రాలు ప్రచురించేటప్పుడు ప్లాజియారిసంపై శ్రద్ధ చూపాలని ఆయన తెలిపారు. ఈ సదస్సులో పేటెంట్ చేసుకునే విధానం పైన కోటిపల్లి ఫణి కిరణ్ మాట్లాడుతూ. .. ఒక ఏదైనా నూతన ఆవిష్కరణ అయితే పేటెంట్ చాలా అవసరం ఉంటుందని వివరించారు. ట్రేడ్ మార్క్స్, కాపీరైట్స్,జియోగ్రాఫికల్ సూచనలు,డిజైన్, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ వంటి అంశాలను ఆధారంగా చేసుకొని మార్కెట్లోకి విడుదల చేస్తారని వివరించారు. పేటెంట్ కు అనువైన అంశాలు, పేటెంట్ పరిధిలోకి, వచ్చే అంశాలు, అలాగే రాని అంశాలు, సంబంధిత ఫీజులు, అప్లై చేయాల్సిన విధానం పైన ఆయన ఉపన్యాసం చేశారు. భారత దేశ సంపద అయిన పసుపు, బాస్మతి, వేప ఉత్పత్తులు, వాటి ఔషధ గుణాలను విదేశీయులు దోచుకుపోతున్నారని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన మీదనే ఉందని అందుకు మేదో సంపత్తి హక్కులు ఉపయోగపడతాయని డాక్టర్ శ్రీనివాసన్ అన్నారు. విశ్వవిద్యాలయాలు హక్కుల కేంద్రాలుగా ఎదగాలని, అలాగే దైనందిన జీవితంలో ప్రతి అంశం ఏదో ఒక మేథో సంపత్తి హక్కుతో ముడిపడి ఉందని ఐపిఆర్ సెల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పిడిగం సైదయ్య తెలిపారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రతి పరిశోధన, అకడమిక్ అంశాలలో పేటెంట్, కాపీరైట్ అంశాలను పరిశీలిస్తేపరిశోధకులు, విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, అలాగే సృజనాత్మకత ఉంటే పెన్సిల్ నుంచి విమానం వరకు పేటెంట్లు పొందే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని డాక్టర్ సైదయ్య తెలిపారు. రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పోతరాజు ప్రశాంత్, దక్షిణ ప్రాంత మండలి హెడ్ డాక్టర్ టీ. సురేష్ కుమార్ మాట్లాడారు.అశ్విన్ కుమార్, డాక్టర్ మజ్జిగ శ్రీనివాస్, ప్రొఫెసర్లు, 250 మంది పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.


మాజీమంత్రి సబితమ్మకు ఆహ్వానం అందచేస్తున్న జయంతి ఉత్సవాల కమిటీ ప్రతినిధులు

## బాబు జగ్జీవన్ రామ్ జయంతికి రండి

బుద్వేల్, మార్చి19(ప్రభాత ఉదయం) : ఏప్రిల్ 5వ తేదీన రాజేంద్రనగర్ సర్కిల్ ఆరాంఘర్ బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తాలో జరుగనున్న మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలను రావాలని కోరుతూ మంగళవారం మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి లకు దళిత సంఘాల నాయకులు ఆహ్వాన పత్రికలను అందచేశారు. జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు పచ్చ నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం, కోశాధికారి రగడంపల్లి శ్రావణ్ ఆధ్వర్యములో పోయిల జీవన్ దాస్, మాజీ అధ్యక్షులు టి ఆర్ శ్రీరాములు, గోల్కొండ రాజు కుమార్, పంబాల రాజు, పలుగు చెరువు మహేష్, బాబురావు, ప్రీతమ్ రాజ్, జాన్ పాల్, బచ్చుల మహేష్, దాసరి రమేష్, జంగయ్య, గోల్కొండ ఉపేందర్, బర్ల సుమన్, ఎడ్లకాడి చంద్ర శేకర్, గౌతమ్, లక్ష్మీ, రమేష్ గుంటి బెంజమిన్ తదితరులు ఉన్నారు.


చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డి కి ఆహ్వాన పత్రిక ను అంద చేస్తున్న దళిత నాయకులు


కల్వ సుజాత తో స్థానిక నాయకులు

## రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన కల్వ సుజాతకు శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ కాంగ్రెస్ నేతలు

కూకట్ పల్లి, మార్చి 19 (ప్రభాత ఉదయం) : తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ గా నియమితులైన కల్వ సుజాత ను కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాచర్ల విష్ణు మినిస్టర్ క్వార్టర్స్ లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ ఈ పదవికి సమర్థమంతమైన న్యాయకత్వం అవసరమని రాష్ట్ర ముఖ్యమంత్రి గ్రహించి ఆర్యవైశ్య మహిళకు పదవి ఇవ్వడం చాలా సంతోషమని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఆర్యవైశ్య సంఘానికి ప్రాముఖ్యత ఇచ్చిన దాఖలాలు లేవని నేటి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్యవైశ్య సంఘానికి గుర్తివ్వడం హర్షణీయమని అన్నారు. ఆర్యవైశ్య సంఘంలో కూడా నిరుపేదలు ఉన్నారని వారి సంక్షేమానికి అన్ని విధాలుగా ఉపయోగపడుతుందని అన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం తరపు నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ, పోసల రాజు, కుమార్ యాదవ్, తదితరుల పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.


ట్రాక్టర్లో మట్టి లోడ్ చేస్తున్న జెసిబి

## మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

గద్వాల ప్రతినిధి(కేటిదొడ్డి) మార్చి 19(ప్రభాత ఉదయం) అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఒక జేసిబి, పది ట్రాక్టర్లను మంగళవారం గద్వాల జిల్లా కేటిదొడ్డి పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. కేటిదొడ్డి ఎస్ఐ శ్రీనివాస్ రావు తెలిపిన వివరాలిలాఉన్నాయి. కేటిదొడ్డి మండల కేంద్రంలోని డంపింగ్ యార్డు సమీపంలో ఓ భూమిలో అనుమతులు లేకుండా కొందరు అక్రమంగా మట్టిని తొవ్వుతున్నారనే పక్కా సమాచారం రావడంతో పోలీసులు అధికారులు అక్కడికి చేరుకున్నారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న, పది ట్రాక్టర్లతో పాటు జెసిబిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమంగా మట్టిని రవాణా చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.


పీడీపీ చౌరస్తాలో గుండె పోటుతో మృతి చెందిన వ్యక్తి

## గుండె పోటుతో వ్యక్తి మృతి

బుద్వేల్, మార్చి19(ప్రభాత ఉదయం): చేవెళ్ల మండలం చిట్టం పల్లి గ్రామానికి చెందిన కృష్ణ కుమారుడు కిషోర్ మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ పీడీపీ చౌరస్తాలో గుండె పోటుకు గురై మరణించాడు. కిషోర్ బెంగళూరులో హొటల్ నడిపిస్తున్నాడు . ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజేంద్రనగర్ పీడీపీ చౌరస్తా కు ఎందుకు వచ్చారో తెలియ రాలేదు.

## ఇంటిని అమ్మి డబ్బుతో వస్తున్న వ్యక్తి వద్ద రూ.26 లక్షలు స్వాధీనం చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు

బుద్వేల్, మార్చి29(ప్రభాత ఉదయం): బుద్వేల్ ఇంద్రానగర్ లో ఉన్న తన ఇంటిని అమ్మి రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి రూ.26 లక్షలతో కుమారుడు మహేష్ తో కలసి బైక్ పై ఇంటికి వస్తున్న బి. యాదగిరి ని రాజేంద్రనగర్ ఎస్ ఐ రవి కిరణ్ వెంబడించి స్వాధీనం చేసుకున్నారు. తాము ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బు అని ఎంత చెప్పినా పోలీసులు వినిపించుకోలేదు. ఆర్డీవో కార్యాలయం సిబ్బంది తో కలసి స్వాధీనం చేసుకున్న డబ్బును వీడియో చిత్రీకరణ చేసి ఆర్డీవో కార్యాలయం లో అప్పగించారు. సరైన పత్రాలు చూపించి డబ్బు తీసుకెళ్లాలని యాదగిరి కి సూచించారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ మాధవి రవి కుమార్

## వ్యవసాయ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

బుద్వేల్, మార్చి 19(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ఫోటోగ్రఫీ పైన నైపుణ్య శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్సి అగ్రి విద్యార్థులు పాల్గొన్నారు. డాక్టర్ మాధవి రవికుమార్ సీనియర్ ప్రొఫెసర్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ చీఫ్ గెస్ట్ గా పాల్గొని విద్యార్థులకు ఫోటోగ్రఫీలో వివిధ అంశాల పైన అవగాహన కల్పిస్తూ నైపుణ్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి. నరేంద్రరెడ్డి, డాక్టర్ కె.బి ఈశ్వరి, డాక్టర్ సవిత తో పాటు అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## బీసీలు అన్ని రంగాలలో కాంగ్రెస్ అండగా నిలవాలి

### శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి, మార్చి 19 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర మోస్ట్ బ్యాక్వర్డ్ క్లాసెస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జేరిపేటి జైపాల్ ను శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల అభివృదే ద్యేయంగా ముందుకుసాగుతుందని, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్ని కుల మతాలకు సామాన్యాయం చేస్తున్నారని, కేవలం కాంగ్రెస్ పార్టీతోనే ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు.శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో రానున్న పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ తీసుకువస్తామని తెలిపారు. బీసీల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని, కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చే విధంగా తన వంతు ప్రయత్నం చేస్తానని కార్పొరేషన్ చైర్మన్ జేరిపేటి జైపాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, టీపీసీసీ లేబర్ సెల్ చైర్మన్ నల్ల సంజీవ రెడ్డి, నాయకులు బాలింగ్ యాదగిరి గౌడ్, కనక మామిడి నరందేర్ గౌడ్, జాయింట్ సెక్రటరీ ఎం.తిరుపతి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వి.వీరేందర్ గౌడ్, ఉపాధ్యక్షులు పి.దినేష్ రాజ్, వివేకానంద నగర్ డివిజన్ అధ్యక్షులు బాష్పక నాగమణి యాదగిరి, పాండు, వెంకన్న, కుమార్ తదితరులు పాల్గొన్నారు..



# దర్జాగ తరలిస్తున్న రేషన్ బియ్యం

### తెలంగాణ రేషన్ బియ్యాన్నికి కర్ణాటకలో భలే డిమాండ్ లబ్ధిదారుల నుంచి సేకరిస్తున్న చిరు వ్యాపారులు




గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 19 (ప్రభాత ఉదయం) పేదలకందాల్సిన రేషన్ బియ్యం అక్రమ వ్యాపారులకు కాసులు కురిపిస్తున్నాయి. జోగులాంబ గద్వాల జిల్లాలో పీడీయస్ బియ్యం అక్రమ రవాణ దర్జాగ నడుస్తోంది. అక్రమ రవాణ అడ్డుకట్ట వేసేందుకు పోలీసు అధికారులు అనేక చర్యలు తీసుకున్న రేషన్ మాఫియా అక్రమ రవాణ మాత్రం ఆగడం లేదు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ఎన్ని సంస్కరణలు తెచ్చినా.. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించినా ఫలితం లేకుండాపోతోంది. సరైనా నిఘా లేకపోవడం, సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహారించడం వల్లే ఈ అక్రమ దందా దర్జాగా సాగుతోందనేది ఆరోపణలు. పట్టణాలలో, గ్రామాలలో రేషన్ బియ్యం సేకరించడానికి ఏజెంట్లను నియమించుకొని రూ.10 కు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. లబ్దిదారుల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లాకు తరలించి అక్కడ రూ.23 నుంచి రూ.28 వరకు విక్రయించి కాసులు చేసుకుంటున్నారు. సేకరించిన రేషన్ బియ్యాన్ని రాత్రి వేళ్లలో అక్రమ రవాణ ఇబ్బందిగా ఉండటంతో తెల్లవారుజామున పోలీసులు నిద్రకు ఉపక్రమించే సమయంలో దర్జాగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. తెల్లవారు జామున 3 గంటల నుంచి ఉదయం వరకు అక్రమ రవాణ కొనసాగుతుందని ఆయా గ్రామాల ప్రజలు బహిరంగానే చర్చించుకోవడం విశేషం. తెల్లవారుజామున పూర్తిగా చెక్కింగ్ లేకపోవడంతో వీరి అక్రమ రవాణకు అడ్డు అదుపు లేకపోవడంతో అక్రమార్కుల వ్యాపారం మూడు పూలు ఆరుకాయలుగా విరాజిల్లుతోంది. గత కొంతకాలంగా ధరూర్ మండలం నెట్టెంపాడు, కేటిదొడ్డి మండలం పాతపాలెం, ఇర్కిచేడు, పాగుంటా, కుచినెర్ల, చింతలకుంట గ్రామాల మీదుగా పోలీసుల నిఘా లేని సమయంలో పట్టపగలే వివిధ వాహనాలలో దర్జాగ రేషన్ బియ్యాన్ని తరలిస్తుండటం విశేషం. అంతేకాకుండా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న దళారులను, వ్యాపారులను అదుపులోకి తీసుకుని జరిమానాలతోనే సరిపెడుతున్నారే తప్ప కఠిన చర్యలు తీసుకోవడం లేదు. కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పర్చినా ఇట్లే బెయిల్‌పై వచ్చి తిరిగి అదే అక్రమ వ్యాపారాన్ని సాగించడంతో రేషన్ బియ్యం అక్రమ దందా ఆగడం లేదని సంబంధిత శాఖ అధికారులు వాపోతున్నారు.

**రవాణా ఇలా..**

ప్రభుత్వం సరఫరా చేసే బియ్యాన్ని లబ్ధిదారులు బహిరంగ మార్కెట్‌లో సగటున కిలోకు రూ.10చొప్పున దళారులకు, ఇతరులకు అమ్ముతున్నారు. మరికొన్ని చోట్ల కొందరు అక్రమార్కులు ఇంటింటికి తిరిగి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో గద్వాల, మల్దకల్, అయిజ, గట్టు, కేటిదొడ్డి, ధరూర్, తదితర మండలాల్లో సేకరించిన రేషన్ బియ్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా కర్ణాటక రాష్ట్రానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడి బియ్యానికి కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లాలో మంచి డిమాండ్ ఉండటంతో కొంతమంది ఇదే పనిగా పెట్టుకొని బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్నారు. ఇక్కడ కిలోకు రూ.10తో కొనుక్కొని అక్కడ కిలోకు రూ.23నుంచి 28వరకు అమ్ముకుంటున్నారు. ప్రతినిత్యం రాత్రివేళల్లో ద్విచక్రవాహనాలు, బొలేరో, ఆటోల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకకు తరలించి లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు.

**దాడులు చేస్తున్నా ఆగని అక్రమ రవాణ**

జిల్లాలో పోలీసులు దాడులు చేస్తూ అక్రమ రేషన్ బియ్యాన్ని అడ్డుకొంటున్నప్పటికీ అక్రమ దందా ఆగడం లేదు. అధికారులు రేషన్ బియ్యం అక్రమ సరఫరాపై నిఘా పెడుతూ క్వింటాళ్ల కొద్ది స్వాధీనం చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లా సరిహద్దు ప్రాంతాలైన గట్టు, కేటిదొడ్డి మండలాల్లో అక్రమ రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా అధికారులు పట్టుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. మార్చి నెలలో కేటిదొడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో మల్లాపురం తాండ వద్ద 22 క్వింటాళ్లు, నందిన్నె చెక్ పోస్టు వద్ద 30 క్వింటాళ్లు, కుచినెర్ల వద్ద 28 క్వింటాళ్లు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు.

**అక్రమార్కులకు రాచమార్గంపసరిహద్దు గ్రామాలు**

జిల్లాలో వివిధ ప్రాంతాలలో సేకరించిన రేషన్ బియ్యాన్ని అక్రమార్కులు రాచమార్గం ద్వారా కర్ణాటక రాష్ట్రానికి బొలేరో, ఆటో వాహనాలలో తరలిస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం ధరూర్ మండలం నెట్టెంపాడు, కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా బూడిదపాడు గ్రామ శివారులో ఉన్న కృష్ణానదీ వాగులో నీళ్లు లేక పోవడంతో అక్రమార్కులు ఈ మార్గం గుండా రాయచూరు జిల్లాకు తరలిస్తున్నారు. వాగు దాటితే చాలు కర్ణాటకలోకి వస్తుండటంతో కర్ణాటక పోలీసులు రేషన్ బియ్యాన్ని పట్టుకోకపోవడం ఇది రాచమార్గంగా మారింది. అదే విధంగా కేటిదొడ్డి మండలం పాతపాలెం, పాగుంటా, ఇర్కిచేడు, నందిన్నె, చింతలకుంట, గట్టు మండలం బల్గెర గ్రామాలలో రేషన్ బియ్యాన్ని తరలించడానికి అవకాశం ఉండటంతో అక్రమార్కులు ఈ మార్గాల గుండా తరలిస్తుండటం విశేషం.

**చర్యలు తీసుకుంటాం: శ్రీనివాస్ రావు, ఎస్ఐ, కేటిదొడ్డి పోలీస్ స్టేషన్**

కేటిదొడ్డి మండల పరిధిలో రేషన్ బియ్యం అక్రమ రవాణను అడ్డుకు నేందుకు పోలీసులు నిరంతరం చెక్ చేస్తున్నారు. రేషన్ బియ్యాన్ని అక్ర మంగా తరలిస్తున్న వారి కదలికలపై నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు.

**నిఘా పెడుతాం: విజయ్ కుమార్, ఎస్ఐ ధరూర్**

ధరూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్న వారిపై నిఘా పెట్టి చర్యలు తీసుకుంటాం. కర్ణాటక రాష్ట్రం సరిహద్దు ప్రాంతాలు నెట్టెంపాడు గ్రామం గుండా అక్రమ రవాణ జరుగుకుండా అడ్డుకుంటాం.



మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన గద్వాల మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

# గద్వాలలో బీఆర్ఎస్‌కు భారీ షాక్

### మున్సిపల్ చైర్మన్‌తో సహా 17 మందికి పైగా కౌన్సిలర్లు కాంగ్రెస్‌లోకి మంత్రి జూపల్లి సమక్షంలో చేరికలు

గద్వాల ప్రతినిధి,మార్చి19(ప్రభాత ఉదయం) స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో గద్వాలలో బీఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గద్వాల్ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ తో పాటు మరో 17 మంది కౌన్సిలర్లు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బిఆర్ఎస్ లో ఉండడంవల్ల అభివృద్ధి పనులు కాకపోవడంతో పాటు, అనేక అవమానాలు ఎదురవుతున్న నేపథ్యంలో తాము ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లుగా మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు తెలిపారు. మంగళవారం కొల్లాపూర్ లో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి నివాసంలో గద్వాల నియోజకవర్గం ఇంచార్జి, జెడ్పీ చైర్ పర్సన్ సరిత ఆధ్వర్యంలో గద్వాల్ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ తోపాటు 17మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్ లో చేరే వారిలో గద్వాల్ మున్సిపల్ చైర్మన్ కేశవ్ తో పాటు 1వ వార్డు కౌన్సిలర్ మాణిక్యమ్మ రామచంద్రుడు, 3వ వార్డు కౌన్సిలర్ గీతమ్మ నాగులు యాదవ్, 8వ వార్డు కౌన్సిలర్ జయమ్మ కోటేష్, 9వ వార్డు కౌన్సిలర్ శ్రీమన్నారాయణ, 12వ వార్డు కౌన్సిలర్ గిరిజబాయ్, 15వ వార్డు కౌన్సిలర్ బంగిప్రియాంక సుదర్శన్, 16వ వార్డు కౌన్సిలర్ సింగిరెడ్డి అనితా శ్రీనివాస్ రెడ్డి, 18వ వార్డు కౌన్సిలర్ నరహరి గౌడ్, 21వ వార్డు కౌన్సిలర్ మహేశ్వరి బొట్టు సుధాకర్, 22 వ వార్డు కౌన్సిలర్ ఎం. నాగరాజు, 24వ వార్డు కౌన్సిలర్ శ్రీను, 25వ వార్డు కౌన్సిలర్ మహేష్, 26వ వార్డు కౌన్సిలర్ కోరి లక్ష్మి (కేడీఆర్), 29వ వార్డు కౌన్సిలర్ అరుణ జనార్దన్, 32 వ వార్డు కౌన్సిలర్ కృష్ణ, 36 వ వార్డు కౌన్సిలర్ రజక రాము,37వ వార్డు కౌన్సిలర్ శ్వేతా రంజిత్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## సినీ నటుడు మురళీమోహన్ సమక్షంలో తెలంగాణ మూవీ టీవీ & డిజిటల్ ఆర్టిస్ట్

# యూనియన్ కమిటీ సభ్యులకు ఘన సన్మానం

### టి ఎం టి డి ఎ యు యూనియన్ సభ్యులకు అవకాశాలు కల్పించండి: యూనియన్ ప్రెసిడెంట్ ఏ రాజశేఖర్

హైదరాబాద్,మార్చి19(ప్రభాత ఉదయం) ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మరియు తెలుగు సినిమా వేదిక ఆధ్వర్యంలో బంజారా హిల్స్ ఎల్వీ ప్రసాద్ ఆడిటోరియం ల్యాబ్ లో సినీ సీనియర్ నటుడు డాక్టర్ మురళీమోహన్ సినిమా రంగంలో 50 సంవత్సరాలు గా విజయవంతంగా సినీ ఇండస్ట్రీలో కొనసాగుతున్న సందర్భంగా ఆయనకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ మూవీ టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ ఎన్నికలలో నూతనంగా ఎన్నికైన సభ్యులందరికీ డాక్టర్ మురళి మోహన్ చేతుల మీదుగా ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా , తెలుగు సినిమా ల వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రెసిడెంట్ ఏ రాజశేఖర్ ( శుభోదయం సుబ్బారావు ) మాట్లాడుతూ... సినీ సీనియర్ నటుడు డాక్టర్ మురళీమోహన్ సినిమా రంగంలో 50 సంవత్సరాలు పాటు రాణించడం చాలా గొప్ప విషయమని, ఆయన సినిమా రంగంలోనే కాకుండా వ్యాపార రంగం, రాజకీయ రంగంలోనూ అత్యున్నత స్థాయికి ఎదిగారని ఆయన చేతుల మీదుగా ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మరియు తెలుగు సినిమా వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ మూవీ టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ కమిటీ సభ్యులకు సన్మానం జరగడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఈ వేదికపై ఎంతోమంది డైరెక్టర్స్ , ప్రొడ్యూసర్స్ ఉన్నారని మరి మా యూనియన్ లో 1200 మందికి పైగా సభ్యులు ఉన్నారని, సినీ రంగంలో అన్ని క్యారెక్టర్లకు ఉపయోగపడే ఆర్టిస్టులు ఉన్నారని, మరి డైరెక్టర్స్ కానివ్వండి ప్రొడ్యూసర్స్ కానివ్వండి మీరు మా యూనియన్ సభ్యులకు అవకాశాలు కల్పించాలని అలాగే కోఆర్డినేటర్ వ్యవస్థను కూడా నిర్మూలించాలని రాజశేఖర్ కోరారు. 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీరాజ్ అనివార్య కారణాలవల్ల కార్యక్రమానికి రాకపోవడంతో ఆయన కుమార్తె కొత్త రంగుల ప్రపంచం మూవీ హీరోయిన్ శ్రీలు పృధ్వీరాజ్ మెమొంటో షీల్డ్ ను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో...ఎఫ్ టి పి సి ఇండియా ప్రెసిడెంట్ చైతన్య జంగా, కార్యదర్శి వర్మ పాకాల పాటి, టి ఎఫ్ సి సి కార్యదర్శి దామోదర ప్రసాద్, కోశాధికారి తుమ్మల ప్రసన్నకుమార్, తెలంగాణ మూవీ టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రాథోడ్, మహిళా వైస్ ప్రెసిడెంట్ పద్మ రేఖ, కార్యదర్శి బోయిడి నూకరాజు, సహకార్యదర్శి రజిని శ్రీకళ, రామ్మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కెపి రెడ్డి, మరియు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ బండి సౌదామని, ఎల్ పద్మావతి, నాగమణి, మాధురి, వర్షిత, ఆకెళ్ళ గోపాలకృష్ణ, సంజీవరావు, ర్యాలి మోహన్రావు, మల్లాది వెంకట కుటుంబ శర్మ, జూనియర్ శోభన్ బాబు, కందుల శివ, కొత్త రంగుల ప్రపంచం హీరో క్రాంతి, ప్రముఖ సినీ నటులు, పి ఆర్ ఓ గోంగూర శ్రీనివాసరావు టీవీ ఆర్టిస్టులు, తెలంగాణ మూవీ టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ సీనియర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.






వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

# బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలో పోలీసులు విస్తృత తనిఖీలు

కూకట్‌పల్లి,మార్చి19 (ప్రభాత ఉదయం) సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంతంలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత వివిధ ప్రాంతాలలో ముమ్మరం తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ నవీన్ కుమార్ మాట్లాడుతూ ఈ తనిఖీలు ఎవరిని ఇబ్బంది పెట్టడానికి కాదని, రూ. 50 వేలకు పైగా నగదు ఉంటే డబ్బు కానీ, ఆ నగలను కాని జప్తు చేయాల్సి ఉంటుందని తెలిపారు. తర్వాత సరైన పత్రాలు చూపించి డబ్బును తీసుకు వెళ్లాల్సి ఉంటుందని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విధంగా తనిఖీలు ప్రతిరోజు నిర్వహిస్తామని ఆయన తెలియజేశారు. ఈ తనిఖీల్లో బాలానగర్ పోలీసులు పాల్గొన్నారు

# పొంగులేటి సుధాకర్ రెడ్డి అండ నాకు వుంది

### డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు 25 ఏళ్ల అంకితభావంతో ఖమ్మంలో ఎంపీ సీటు సాధిస్తానన్న విశ్వాసం





ఖమ్మం, మార్చి 19 (ప్రభాత ప్రతినిధి) ఖమ్మంలో వైద్యనిపుణులు, ప్రజాసంఘాల నాయకులైన డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు పార్లమెంటు సభ్యునిగా సీటు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో ఆయన పార్లమెంటరీ ఎన్నికల బరిలోకి దిగడంపై రాజకీయ రంగప్రవేశం జరుగింది. డాక్టర్ వెంకటేశ్వర్లు వైద్య రంగంలో 25 సంవత్సరాల పాటు విశిష్టమైన ట్రాక్ రికార్డ్‌తో, బలమైన స్థానిక ఉనికిని , సమాజానికి సేవ చేయడానికి అంకితమైన హృదయాన్ని కలిగి ఉన్నారు. కేవలం తన వైద్యసేవకే పరిమితం కాకుండా డాక్టర్ వెంకటేశ్వర్లు అనేక స్వచ్ఛంద కార్యక్రమాలలో అంతర్భాగంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. అవసరమైన వారికి సహాయం చేస్తున్నారు. విహెచ్‌పి, శిశు మందిర్ వంటి సంస్థల అధ్యక్షుడిగా ఆయన తిరుగులేని మద్దతు , పదవీకాలం బిజెపి కార్యకలాపాలలో చురుకైన ప్రమేయం సామాజిక సంక్షేమం పట్ల అతని నిబద్ధతను మరియు అట్టడుగు అభివృద్ధి పట్ల కర్తవ్య భావాన్ని పెంపొందించుకుని, స్థానిక మూలాలను మరియు ఖమ్మం ప్రజలతో గాఢమైన అనుబంధాన్ని నొక్కి చెబుతూ, డాక్టర్ వెంకటేశ్వర్లు వివిధ వర్గాల నుండి విస్తృతమైన మద్దతును పొందుతున్నారు. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల భాజపా కో-ఇంఛార్జి డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి ఆశీస్సులు, మద్దతు ఆయన రాజకీయ ప్రయత్నానికి మరింత బలం చేకూర్చింది. అదనంగా స్థానిక వైద్యులు, బిజెపి మరియు ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకులు, స్నేహితుల సర్కిల్ మరియు ప్రజలతో పాటు డాక్టర్ వెంకటేశ్వర్లు ప్రచారానికి తమ తిరుగులేని మద్దతును అందించారు. సంవత్సరాల తరబడి చేసిన సేవ, సమాజ నిబద్ధత , రాజకీయ చతురతతో నిర్మితమైన దృఢమైన పునాదితో డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు ఖమ్మంకు సరికొత్త దృక్పథాన్ని మరియు అంకితభావంతో కూడిన నాయకత్వాన్ని తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారు. ఇది రాబోయే రోజుల్లో పురోగతి మరియు శ్రేయస్సు కోసం బలవంతపు దృష్టిని అందిస్తుంది. డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు యొక్క ప్రయాణం, అతని సంఘం ప్రమేయం మరియు ఎంపీగా తన సాధనలో ఆయన పొందిన మద్దతును ప్రదర్శిస్తుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు మాజీ ఎమ్మెల్సీ, బిజెపి సీనియర్ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి మద్దతు పూర్తిగా వుందని, ఖమ్మం ఎంపి సీటు తనకి కేటాయించడం ఖాయమని, బిజెపిని గెలిపించి బహుమతిగా అందిస్తానన్నారు.



శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన కొండాపూర్ డివిజన్ బీఆర్ఎస్ మహిళ నాయకురాలు

కూకట్‌పల్లి, మార్చి 19 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ బాబా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, టీపీసీసీ లేబర్ సెల్ చైర్మన్ నల్ల సంజీవ రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఎం.తిరుపతి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వి.వీరేందర్ గౌడ్, ఉపాధ్యక్షులు పి.దినేష్ రాజ్, నాయకులు మనెపల్లి సాంబశివరావు, పల్లపు సురేందర్, వివేకానంద నగర్ డివిజన్ అధ్యక్షులు బాష్పక యాదగిరి, ప్రభాకర్, గోపాల్, నర్సింహ రాజు, కిరణ్, జగదీశ్, గోపాల్ నాయక మహిళలు అస్మా, రిజ్వాన, షేనాసా, సమీరా, సలమ,ఆశ బేగం, ఆసరా, తస్లీమ్, మీనా, సారా తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.